


ఉద్యమకారులపై కేసు కొట్టివేత

తాండూరు, సెప్టెంబర్ 17: తెలంగాణ ఉద్యమకారులపై నమోదైన కేసును మంగళవారం తాండూరు కోర్టు కొట్టేసింది. ఉద్యమకారుడు అయూబ్‌ఖాన్ ఆత్మాహుతి చేసుకున్న సమయంలో ఆయన కుటుంబానికి న్యాయం జరగాలని 2017లో ధర్నా చేసిన వెంకటేష్‌చారి, భాను ప్రసాద్, ఫిరోజ్ ఖాన్, ఆరీఫ్, సాదిక్‌లపై కేసులు నమోద య్యాయి. ఎట్టకేలకు ఏడేళ్ల తర్వాత వాదోపవాదనల అనం తరం కేసును కొట్టేసినట్లు న్యాయవాది గోపాల్ తెలిపారు.




ఘట్‌కేసర్ ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో గణపయ్య నిమజ్జనం

జనం నుంచి జలంలోకి..

- వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో ఘనంగా వినాయక నిమజ్జనం
- గణనాథుడి లడ్డూ ప్రసాదం కోసం తీవ్ర పోటీ
- రూ. 4.51 లక్షలు పలికిన ఇందిరానగర్‌లోని గణపతి లడ్డూ



వికారాబాద్, సెప్టెంబరు 17: విఘ్నాలను తొలగించే గణనాథుడు మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లాతో పాటు, వికారాబాద్ జిల్లాలోని పరిగి, కొండగల్, వికారాబాద్ నియోజకవర్గాల్లో జయజయధ్వానాల మధ్య గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. అశేష భక్తజనావళితో నవరాత్రులు విశేష పూజలందుకున్న లంబోదరుడు మళ్లొచ్చే ఏడాది వస్తానంటూ భక్తులకు వీడ్కోలు పలికాడు. కోలాటాలు, మంగళహారతులతో నిమజ్జనోత్సవానికి బయల్దేరిన గణనాథులను మహిళలు వాడవాడలా ఎదురేగి సాగనంపారు. భారీ ఏర్పాట్ల మధ్య శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వివిధ ఉత్సవ సమితులు, సంఘాలు, సేవాసంస్థలు స్వాగత వేదికలు ఏర్పాటు చేసి గణనాథులకు స్వాగతం పలికి పూజాది కార్యక్రమాలు నిర్వహించాయి. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అదే విధంగా గణనాథుల లడ్డూల కొనుగోలు చేసేందుకు భక్తులు పోటీపడ్డారు. వికారాబాద్ పట్టణ ఇంద్రానగర్ గణనాథుడి లడ్డూను గంగారం రాజుగౌడ్ రూ. 4.51 లక్షలకు దక్కించుకున్నాడు. రామయ్యగూడలో స్నేహ యువజన సంఘం (జూనియర్స్) రూ.1.20 లక్షలకు, మద్గుల్ చిట్టంపల్లిలో తిరుమల అసోసియేషన్ సభ్యులు రూ.1.6 లక్షలు, శివారెడ్డిపేట హనుమాన్ ఆలయంలో గణపతి లడ్డూను రూ 1.6లక్షలు కు గడ్డం జనార్దన్ దక్కించుకున్నారు. కొత్తగంజ్‌లోని హనుమాన్ దేవాలయంలో మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ రమేష్ రూ. 78,888 దక్కించుకోగా, అదే బస్తీలోని మరో గణనాథుడి వద్ద ముస్లిం యువతి ఇఫ్రత్ వేలంలో రూ.22 వేలకు గణేష్ లడ్డును దక్కించుకుంది. వాసవి కాలనీలోని లడ్డూను రూ. 1.95 లక్షలకు వినాయక బోర్ వెల్స్ ప్రవీణ్ దక్కించుకున్నారు. అంతేకాకుండా పలు కాలనీల్లో భక్తులు పోటీపడి లడ్డూను దక్కించుకున్నారు.





శామీర్‌పేట చెరువు వద్ద గణనాథులకు పూజలు



వికారాబాద్‌లో శోభాయాత్ర



ఇంద్రానగర్ గణేష్ లడ్డూను దక్కించుకున్న రాజుగౌడ్



శివరాంనగర్‌లో శోభాయాత్ర



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

అనంత వ్రతాలు

- పూజలో పాల్గొన్న 193 జంటలు

వికారాబాద్, సెప్టెంబరు 17: అనంత చతుర్ధశి సందర్భంగా అనంతగిరి అనంతపద్మనాభ స్వామి ఆలయంలో అనంతపద్మనాభ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక వ్రతాలు నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా భక్తులు దైవ దర్శనం చేసుకుని వ్రతాలు నిర్వహించారు. ఈపూజ కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర నుంచి పెద్ద ఎత్తున భక్తులు రాగా 193 మంది జంటలు ఈ వ్రతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎస్. పద్మనాభం, ఈవో నరేందర్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

కలెక్టర్ ప్రతీక్‌జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 17: కుక్కల జనన నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పశుసంవర్ధక శాఖ అధికారులతో కుక్కల జనన నియంత్రణపై చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుక్కకాటుతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారని, కుక్కల బెడదతో ప్రజలు ఎంతగానో భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. కుక్కల ఉత్పత్తిని తగ్గించే దిశగా జిల్లాలో జంతు జన నియంత్రణ కేంద్రాలను ఏర్పాటు చేసి కుక్కలకు సంతానోత్పత్తి జరగకుండా ఆపరేషన్ నిర్వహించేందుకు సన్నాహాలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆపరేషన్లకు సంబంధించి టేబుల్స్, లైట్లు సమకూర్చుకోవడంతోపాటు ఆపరేషన్ థియేటర్లో ఏసి ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాల పెద్ద మొత్తంలో కుక్కలను పట్టుకొని జంతు జనన నియంత్రణ కేంద్రాలకు తరలించాలని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసి సెప్టెంబర్ 20 తేదీ నుండి సంతానోత్పత్తి నిరోధక శస్త్ర చికిత్సలు చేపట్టాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఆపరేషన్లకు కావలసిన పరికరాలను, ఇంజక్షన్లు, మందులను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. జూమ్ మీటింగ్ లో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, డివిహెచ్‌ఓ సదానందం, తాండూర్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌లు ఉన్నారు.

మాకొద్దీ పురపాలన

- ఆందోళనలో ఆరు గ్రామాల ప్రజలు
- ఉపాధి లేక అభివృద్ధిపై ఆవేదన
- మళ్లీ పంచాయతీలుగా మార్చాలని కలెక్టర్‌కు వినతి

7





మేడ్చల్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

మేడ్చల్ సెప్టెంబర్ 17(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్నామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా పాలన దినోత్సవ వేడుకలు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిని నివేదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్‌లు రాధికాగుప్తా, విజయేందర్ రెడ్డి, డీసీపీ కోటిరెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, తోటకూర వజ్రేష్‌యాదవ్, హరివర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఆయా శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్‌లు, మేయర్లు పాల్గొన్నారు.

త్యాగాల ఫలితమే తెలంగాణ

- ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్న ప్రభుత్వం
- తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎంతో మంది త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ రాష్ట్రమని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. దేశమంతటా 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటూ ఉంటే, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు. తెలంగాణ చరిత్రలో సెప్టెంబరు 17 కీలకమైన రోజన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో ముందున్నదని, ప్రజలకు ఇచ్చిన అభయ హస్తం హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే ప్రజాపాలనకు అంకురార్పణ చేసి ప్రభుత్వ హామీల అమలుకు గ్రామాల్లో, వార్డుల్లో సభలు ఏర్పాటు చేసి 2.84 లక్షల మంది లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారని, వివిధ పథకాలకు అర్హులైన వారిని గుర్తించడం జరుగుతోందన్నారు. జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ అగ్రభాగంలో నిలపడానికి అందరి సహకారం కావాలని ఆయన కోరారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోగా, వారికి స్పీకర్ జ్ఞాపికలను అందజేసి అభినందించారు. జిల్లాలో 278 మహిళా సంఘాలకు స్త్రీనిధి బ్యాంకు లింకేజీ కింద రూ.26.76 కోట్లు, ప్రధానమంత్రి స్వానిధి బ్యాంకు లింకేజీ ద్వారా రూ.15 కోట్ల చెక్కులు స్పీకర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, పరిగి, తాండూరు, చేవెళ్ల ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినుల ప్రదర్శన



వికారాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ప్రత్యేక ఆకర్షణగా ఇవాన్‌జైన్

కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజా పాలన వేడుకల్లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ కుమారుడు సందడి చేశారు. కార్యక్రమానికి కలెక్టర్ ప్రతీక్ జైన్ సతీమణితో పాటు రెండేళ్లకుమారుడు ఇవాన్ జైన్ హాజరయ్యారు. వేదికపై నుంచి తన తండ్రి సాయుధ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించడాన్ని గమనించిన ఇవాన్ జైన్ ఆ తార్వత వేదికకు ఎదురుగా ఉన్న పోలీసులను చూసి పలుమార్లు సెల్యూట్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు నమస్కరించాలని ప్రతీక్‌జైన్ సూచించగా సంతోషంతో చప్పట్లు కొడుతూ ఆకట్టుకున్నాడు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్ నమస్కరిస్తున్న కలెక్టర్ కుమారుడు






పాడి రైతులను గోస పెడుతున్న ప్రభుత్వం

నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా





పాల బిల్లులను వెంటనే చెల్లించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 17: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించకుండా ఇబ్బందులకు గురి చేస్తుందని ఆమనగల్లు మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు అనురాధాపత్యానాయక్ ఆరోపించారు. పాడి రైతులకు నెలల తరబడి బిల్లులు చెల్లించకుండ వారిని ఆవేదనకు గురి చేస్తుందని ఆమె మండిపడ్డారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతీ 15 రోజులకు ఓసారి పాడి రైతులకు బిల్లులు చెల్లించేదని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సకాలంలో బిల్లులు చెల్లించకుండ రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. విజయ పాడి డెయిరీ రైతులకు మూడు నెలల కాలంగా పాల బిల్లులు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం ఆ మనగల్లు బస్టాండ్ ఎదుట పాడి రైతులతో కలిసి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. సమావేశంలో నాయకులు గుత్తిబాలస్వామి, ఎంగిలిరఘు, సరిత, పంతునాయక్, చుక్కనిరంజన్‌గౌడ్, రమేష్‌నాయక్, వెంకటేష్, సురేందర్‌రెడ్డి, గణేశ్ తదితరులున్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న అనురాధాపత్యానాయక్

క్రీడారంగ అభివృద్ధికి కృషి చేయాలి


శ్రీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్, సెప్టెంబరు 17: బాల్ బ్యాండ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన కల్వకుర్తి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులు అభినందించారు. మంగళవారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూలమాలలు, శాలువాలతో శ్రీకాంత్ రెడ్డిని సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గం క్రీడారంగంలో అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్ద పీట వేస్తుందని తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు ప్రతి ఒక్కరూ చేయూతనందించి ప్రోత్సహించాలని కోరారు. ప్రతీ మండల కేంద్రంలో బాల్ బ్యాడ్మింటన్ స్టేడియాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని శ్రీకాంత్‌రెడ్డికి వారు సూచించారు. కార్యక్రమంలో కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కడ్తాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యనాయక్, వెల్దండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతిలాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండాల పర్వత్ రెడ్డి , మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, పుల్లయ్య, ప్రసాద్‌గౌడ్, బాల్‌రాజ్, మల్లేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.















మాకొద్దీ పురపాలన


బూర్గుపల్లి గ్రామ ముఖ చిత్రం

- ఆందోళనలో ఆరు గ్రామాల ప్రజలు
- ఉపాధి లేక అభివృద్ధి కాదని ఆవేదన
- మళ్లీ పంచాయతీలుగా మార్చాలని కలెక్టర్‌కు వినతి

వికారాబాద్, సెప్టెంబరు 17 : ఐదేళ్ల క్రితం వికారాబాద్ పట్టణ విస్తరణలో భాగంగా 28 వార్డులను 34కు పెంచారు. అందులో భాగంగానే ఆరు గ్రామ పంచాయతీలను వికారాబాద్ మున్సిపాలిటీలో కలిపారు. అయితే ఇప్పుడు ఆ గ్రామాల ప్రజలు ఈ పురపాలన తమకొద్దంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ పంచాయతీలుగా మార్చాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వికారాబాద్ జిల్లా కేంద్రం కావడంతో పట్టణాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో 28 వార్డులుగా ఉన్న వికారాబాద్‌లోకి బూర్గుపల్లి, మద్గుల్ చిట్టంపల్లి, ధన్నారం, గిరిగేట్‌పల్లి, కొంపల్లి, గుడుపల్లి గ్రామాలను కలుపుతూ వార్డుల సంఖ్యను పెంచారు. అక్కడ ఎన్నికలు సైతం నిర్వహించి కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ఈ గ్రామాల్లో 75 శాతానికి పైగానే వ్యవసాయం మీద ఆధార పడి జీవించేవారున్నారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిత్యం పని దొరికేది. అయితే ఆ గ్రామాలు బల్దియాలో ఉండడంతో ఉపాధి హామీ పనికి దూరమయ్యారు. కాగా, ఆ గ్రామాలు అభివృద్ధికి కూడా నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు కాల్వల సమస్యతో పాటు లైటింగ్ సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు అదనపు ట్యాక్స్‌లు ఆ గ్రామస్తులకు సమస్యగా మారింది. దీంతో తమ గ్రామాలను ఎలాగైనా మళ్లీ పంచాయతీలుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

స్పీకర్ ప్రసాద్‌కుమార్ దృష్టికి..

ఈ సమస్యపై ఆయా గ్రామల ఇప్పటికే కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి సమస్యను విన్నవించి వినతి పత్రాలు అందజేశారు. అదే విధంగా శాసనసభ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్ కుమార్‌ను కలిసి సమస్యను విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఎలాగైనా తమ గ్రామాలను మున్సిపాలిటీ నుంచి విముక్తి కల్పించి పూర్వ స్థితి కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఇప్పటివరకు అభివృద్ధి శూన్యం



మా గ్రామంలో ఏ అభివృద్ధి జరగడం లేదు. పంచాయతీగా ఉన్నప్పుడే బాగుండే. ఉపాధి దొరకడం లేదు. అయినా ఎక్కువ మొత్తంలో ట్యాక్స్‌లు చెల్లించాల్సి వస్తోంది. అధికారులు, నాయకులు స్పందించి మా గ్రామాన్ని మళ్లీ పంచాయతీగా మార్చాలి.

- అనసూజ, బూర్గుపల్లి

ఇంకా వెనకబడిపోతున్నాం



పంచాయతీగా ఉన్నప్పుడు ఉపాధి హామీ పనులకు వెళ్లే వాళ్లం. ఇప్పుడు మున్సిపాలిటీలో కలవడంతో ఉపాధి హామీ పనులకు దూరమయ్యాం. ఇతర పనులు చేసుకుందామన్నా అవకాశాలు లేవు. దీంతో మా గ్రామాలు ఇంకా వెనుకబడిపోతున్నాయి.

- చిగుర్ల రాములు, గుడుపల్లి

అభిప్రాయ సేకరణ కూడా జరగలేదు



గ్రామాలను మున్సిపాలిటీలో కలిపే విషయంలో ప్రజల అభిప్రాయం తీసుకోలేదు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామాలను మునిసిపల్‌లో కలిపారు. టేకులగడ్డ తండా 14 కిలో మీటర్ల దూరంలో ఉంటుంది దాన్ని కూడా చేర్చారు. వార్డుకు ముగ్గురు చొప్పున పారిశుధ్య కార్మికులు కేటాయించారు. ప్రత్యేక నిధులన్నారు అవి కూడా ఏం లేవు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

- గోపాల్, కౌన్సిలర్, మద్గుల్ చిట్టంపల్లి

త్వరలో మహానగరంగా 'మహేశ్వరం'

మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి


వేం నరేందర్‌రెడ్డితో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 17 : మహేశ్వరం త్వరలోనే మహానగరంగా అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో జరిగిన వేడుకల అనంతరం ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో ఫోర్త్ సిటీ పనులకు త్వరలో శ్రీకారం చుట్టడంతో పాటు మహేశ్వరం మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రభుత్వ పెద్దలు అంగీకరించారని తెలిపారు. ఫోర్త్ సిటీలో విద్య, వైద్యం, మెట్రో, రహదారుల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డికి తగిన ప్రణాళికలు అందజేశామన్నారు. అదే విధంగా మండల కేంద్రాన్ని మున్సిపాలిటీగా మారిస్తే అభివృద్ధి మరింత పరుగులు పెట్టడంతో పాటు భూముల ధరలు పెరుగుతాయన్నారు. ఇక నుంచి ఒక్క మహేశ్వరం నియోజకవర్గమే కాకుండా రంగారెడ్డి, మహబూబ్‌నగర్ తదితర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కృష్ణానాయక్, కాకి ఈశ్వర్, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న అధికారులు


అక్రమ నిర్మాణానికి డంప్ చేసిన రాళ్లు, కంకర

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 17 : మండలంలోని డబిల్‌పూర్ పంచాయతీ పరిధిలో సర్వే నంబర్ 112 పార్ట్, 113 పార్ట్‌లో నిబంధనలకు విరుద్ధంగా 29 ప్లాట్లతో తయారు చేసిన అక్రమ లేఅవుట్లో చేపడుతున్న నిర్మాణాలను స్థానిక పంచాయతీ సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. ప్లాట్ల క్రయ విక్రయాల్లో రియల్టర్లు చేస్తున్న మోసాల పట్ల 'సక్రమం పేరుతో అక్రమం' అనే శీర్షికను ఇటీవల ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న స్థానికులు గ్రామ పంచాయతి అధికారులకు ఫిర్యాదు చేశారు దీంతో సిబ్బంది ప్లాట్ల వద్దకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. కాగా పనులను అడ్డుకుంటున్న సిబ్బందితో నిర్మాణాలు చేపడుతున్న ప్లాట్ల యజమానులకు వాగ్వాదం జరిగింది. నిర్మాణం చేస్తే కూల్చి వేస్తామని హెచ్చరించటంతో పనులు నిలిపివేసినట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. డబిల్‌పూర్ కార్యదర్శి ఉమా దేవి మాట్లాడుతూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతుండగా అడ్డుకున్నామన్నారు.

ఆలయ భూములు అన్యాక్రాంతం

గతంలోనే కాజేసిన నాయకులు, పూజారులు

పూజలు లేక శిథిలమవుతున్న ఆలయాలు

పట్టించుకోని ఎండోమెంట్ అధికారులు


శిథిలావస్థకు చేరిన నందివనపర్తి శివాలయం

యాచారం, సెప్టెంబరు 17: ఒకనాడు దూపదీపాలు, భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు నేడు కనీస పూజలకు నోచుకోని పరిస్థితి నెలకొంది. దేవుడి మాన్యాలుగా ఉన్న భూములను పలుకుబడి గల నాయకులు, పూజారులు తమ పరపతితో వారి సొంతం చేసుకున్నారు. ఈ భూములను చాలా వరకు నాయకులే సొంత చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దాంతో నేడు ఆలయాలకు ఎటువంటి ఆదాయం లేక శిథిలావస్థకు చేరుకున్నాయి. పలుచోట్ల పూజారులకు ఆలయ భూములపై హక్కులు కల్పించడంతో దేవుడి మాన్యాలు అన్యాక్రాంతమయ్యాయి. యాచారం మండలం నందివనపర్తిలోని శివాలయానికి కొంత భూమి ఉండేది. ఆభూమి పరులపరం కావడంతో ఆ ఆలయాన్ని పట్టించునే నాథుడే కరువయ్యాడు. దీంతో ఆలయం పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. ఏటా మహా శివరాత్రికి కొందరు గ్రామస్తులు సొంత డబ్బుతో సున్నం వేయించి పూజలు చేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి సొంత నిధులతో ఆలయానికి ప్రహరీని నిర్మించారు. కార్తీక మాసంలో సూర్యకిరణాలు శివలింగంపై పడతాయని ఆ సమయంలో స్వామి వారిని దర్శించుకుంటే భక్తుల కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం.

నిత్య పూజలు కరువు

ధర్మన్నగూడలోని ఆంజనేయ స్వామి ఆలయానికున్న భూమిని కొందరు పలుకుబడి గల నాయకులు కాజేశారనే విమర్శలు వినిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు భక్తులు సొంత నిధులతో ఆలయనికి స్లాబ్ వేయించారు. కాని గోడలు నిర్మించడానికి భక్తులు ముందుకు రాకపోవడంతో అది కూడా పాడవుతోంది. చిన్నతూండ్ల వేణుగోపాల స్వామి ఆలయ భూమి కూడా అన్యాక్రాంతమైందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. నేడు ఆలయంలో పూజలు చేయకపోవడంతో పాటు ఆలయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. మేడిపల్లిలో లక్ష్మీనరసింహా స్వామి వారి ఆలయం గ్రామానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో గుట్టపై ఉంది. గతంలో ఆలయంలో నిత్యం పూజలు జరిగేవి. నేడు పూజలు చేసే వారు కరువయ్యారు. దాంతో ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఆలయానికి దగ్గరలో పురాతనమైన శ్రీపబ్బతిఆంజనేయ స్వామి భారీ బండరాయిపై వెలిశారు. గున్‌గల్‌లోని శివాలయంలో పూజలు లేక ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. మహా శివరాత్రికి కొందరు భక్తులు సొంత నిధులతో రంగులు వేయించి స్వామి వారికి పూజలు చేస్తుంటారు. తాటిపర్తి ఆంజనేయ స్వామి ఆలయానికి 5 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గ్రామస్తులు సాగు చేసుకుంటున్నారు. ప్రతి ఏటా శ్రీరామ నవమికి కొంత డబ్బు పూజారికి ఇస్తుంటారు. ఆ డబ్బుతో ఆలయంలో పూజారి తరచూ పూజలు చేస్తున్నారు. కాని ఈ భూమి తమదేనని కొందరు రైతులు పట్టా చేయించుకునేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం.

ఆలయ భూములను కాపాడాలి



చిన్నతుండ్ల వేణుగోపాలస్వామి భూమి నేడు కనుమరుగైంది. రెవెన్యూ అధికారులు పాత రికార్డులు పరిశీలన చేసి భూమిని ఆలయానికి చెందెలా చర్యలు తీసుకోవాలి. కొందరు ఆ భూమిని విక్రయించడంతో ఆలయానికి ఆదాయం లేకుండా పోయింది. దీంతో పూజలు జరగక ఆలయం శిథిలావస్థకు చేరింది. ధర్మన్నగూడ ఆంజనేయస్వామి మాన్యం కూడా అన్యాక్రాంతమైంది. అధికారులు విచారణ చేసి ఆలయాల భూములను కాపాడాలి.

-నాగటి బుగ్గరాములు, రైతు చిన్నతూండ్ల

వైభవంగా అనంతపద్మనాభస్వామి చతుర్థి


హోమం నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూర్, సెప్టెంబర్ 17: మండల పరిధిలోని పెంజర్ల గ్రామ శివారులో వెలసిన శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో స్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం అనంత చతుర్థి వేడుకలను వైభవంగా నిర్వహించారు. పదుల సంఖ్యలో దంపతులు పాల్గొని అనంత చతుర్థి వ్రతాలు, కోటి దీపార్చనలతో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పాలకమండలి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తులకు అవసరం మేరకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతీ శనివారం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పాఠశాలలో చెట్ల నరికివేతపై విచారణ


వివరాలు సేకరిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, సెప్టెంబర్ 17 : మండలంలోని దస్తగిరిపేట్ పాఠశాలలోని చెట్ల నరికివేతపై విద్య, అటవీ శాఖ అధికారులు మంగళవారం విచారణ జరిపారు. ముందుగా మండల విద్యాధికారి వెంకటయ్య హెచ్‌ఎం సుభాష్‌తో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అయితే కోతుల బెడదతో పాటు దోమలు, ఈగలు, చిన్నచిన్న పురుగులు వస్తుండటంతో అటవీ శాఖ అధికారుల అనుమతితోనే చెట్లు నరికామన్నారు. వాటి ద్వారా రూ.13 వేల ఆదాయం వచ్చిందని, ఆ డబ్బును స్కూల్ అభివృద్ధికి వినియోగిస్తామన్నారు. తాండూరు అటవీ రేంజ్ అధికారి రాజేందర్ ఆదేశాల మేరకు తాండూరు అటవీ శాఖ సెక్షన్ అధికారి పీర్యానాయక్ తన బృందంతో పాఠశాలను సందర్శించి సమగ్ర వివరాలు సేకరించారు. పాఠశాల ఆవరణలో మొత్తం చెట్లు ఎన్ని ఉన్నాయి? ఎన్ని నరికారు? అనుమతి తీసుకున్న చెట్లే నరికారా? ఇతర చెట్లు ఏమైనా నరికారా? అనే సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయుడు ద్వారా సేకరించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విద్యాధికారి వెంకటయ్య, సెక్షన్ అధికారి పీర్యానాయక్‌లు పేర్కొన్నారు. అంతకుముందు పాఠశాలలో అంతారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వడ్డె శ్రీనివాస్‌తోపాటు మరికొందరు పాఠశాలను సందర్శించి చెట్లు నరకడంపై ప్రధానోపాధ్యాయునితో మాట్లాడారు. ఇప్పటికైనా నరికిన చెట్ల స్థానంలో కొత్తవినాటేలా చర్యలు చేపట్టాలన్నారు.


పట్టణ పారిశుధ్యం కోసం పాటుపడదాం

ప్రతిజ్ఞ చేసిన ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు


ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు

షాద్‌నగర్‌అర్బన్, సెప్టెంబర్ 17: షాద్‌నగర్ పట్టణ పారిశుధ్యం, పచ్చదనం కోసం పాటుపడతానని ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు ప్రతిజ్ఞ చేశారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం షాద్‌నగర్ మున్సిపాలిటీలో జాతీయ జెండావిష్కరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్, కౌన్సిలర్లు, పార్టీల నాయకులు, పట్టణ ప్రముఖులు హాజరయ్యారు. వారందరిచేత మున్సిపల్ కమిషనర్ వెంకన్న పట్టణ పారిశుధ్యం, పచ్చదనంపై ప్రతిజ్ఞ చేయించారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలు, పట్టణ రోడ్లు పరిశుభ్రంగా ఉండడానికి తన వంతు కృషి చేస్తానని, తడి చెత్త, పొడి చెత్తతో పాటు ప్రామాదకరమైన వస్తువులను వేరు చేసి, పట్టణ పారిశుధ్యానికి పాటుపడుతానని ప్రతిజ్ఞ చేశారు. షాద్‌నగర్‌ను చెత్త రహిత పట్టణంగా మార్చేందుకు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తానని ప్రతి ఒక్కరూ ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తాం


మహిళలకు గ్యాస్ సబ్సిడీ ప్రొసిడింగ్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబర్ 17 : కరన్‌కోట్ గ్రామంలో ఇళ్లు లేనివారందరికీ ఇళ్లు ఇచ్చే బాధ్యత ఎమ్మెల్యేగా తాను తీసుకుంటున్నానని బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాపాలనలో భాగంగా కరన్‌కోట్ గ్రామాన్ని సందర్శించారు. మాజీ ఎంపీపీ శరణుబసప్ప, తుపాకుల బసప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే 955 మందికి రూ.500లకే గ్యాస్ సబ్సిడీకి అర్హులుగా తేలారని, వారందరికీ ప్రొసిడింగ్స్ కాపీ అందించామన్నారు. ఇళ్లు లేనివారందరికీ స్థలాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్, దారాసింగ్, మండల ఇన్‌చార్జి పంచాయతీ అధికారి ఆనంద్‌రావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

తెలంగాణ తల్లి పేరుతో బీఆర్ఎస్ కుట్ర


మాట్లాడుతున్న అనిల్‌గౌడ్

ఆమనగల్లు, సెప్టెంబరు 17: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని యువజన కాంగ్రెస్ తాలుకా అధ్యక్షులు అనిల్ గౌడ్ ప్రశ్నించారు. సచివాలయ ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెడితే కేటీఆర్ తొలగిస్తామనడం వారి అహంకారం, అవివేకానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అనిల్ గౌడ్ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణలో పదేళ్లు అధికారం అనుభవించిన బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ ను తోడేళ్లలా దోచుకుతిన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులకు తెలంగాణ అనేక పదాన్ని కూడ ఉచ్చరించే అర్హత లేదన్నారు. ప్రజలు తిరస్కరించిన బీఆర్ఎస్ నాయకుల్లో మార్పు రాలేదని పేర్కొన్నారు. తెలంగాణ సెంటిమెంట్‌ను రాజేసి మళ్లీ రాజకీయ లబ్ధిపొందేందుకు బీఆర్ఎస్ యత్నిస్తుందని మండిపడ్డారు. గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణత్యాగాలు, పదవుల త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. రాజీవ్ గాంధీ సాంకేతిక రంగంలో దేశాన్ని ముందుకు తీసుకెళ్లారని ఆయన గుర్తు చేశారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడని ఎర్రగడ్డ పిచ్చి ఆసుపత్రిలో చేర్పించాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డిపై మరోసారి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే కౌశిక్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కడ్తాల్, సెప్టెంబరు 17 : బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ కోరారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కడ్తాల్ మండలం చల్లంపల్లిలో విద్యుత్ సబ్‌స్టేషన్ సందర్శించి విద్యుత్ సరఫరాపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లో వోల్టేజీ మూలంగా బోర్‌మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించడంతో పాటు అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని ఆయన హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రధాన రహదారి నుంచి చెల్లంపల్లికి నూతనంగా నిర్మిస్తున్న బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులనుపరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు రూ.19.5 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. చల్లంపల్లి బీఎసీ కేంద్రాన్ని కూడా ఆయన పరిశీలించి పాడి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఎంపీటీసీ ప్రియారమేష్, నాయకులు కొమరయ్య, రాజేందర్‌యాదవ్, సాయిలు తదితరులు ఉన్నారు.


మూడు రోజుల క్రితం అలుగు పారుతున్న చెక్‌డ్యాం


నేడు ఖాళీగా దర్శనమిస్తున్న వాగు

మొన్న కళకళ.. నేడు వెలవెల

చెక్‌డ్యాం తూము లేక నీరు వృథా

మూడు రోజుల్లో జుంటివాగు ఖాళీ

బషీరాబాద్, సెప్టెంబర్ 17: ఇటీవల విస్తారంగా కురిసిన వర్షాలకు మూడు రోజుల ముందు నీటితో కళకళలాడిన బషీరాబాద్ జుంటివాగు ఒక్కసారిగా ఖాళీ అయి వెలవెలబోతోంది. ఈ చెక్‌డ్యాంకు తూము లేకపోవడంతో పాటు సైడ్ వింగ్‌వాల్ కూలిపోవడంతో వరద నీరంతా ఎప్పటికప్పుడూ వృథా కిందకు వెళ్లిపోయింది. ఈ జుంటివాగు వర్షకాలం సీజన్‌లో చెక్‌డ్యాం ఎగువ భాగం నీటితో కళకళలాడేదని, ఐదారు ఏళ్లుగా ఆ పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. జుంటివాగు దుస్థితిని పట్టించుకోకపోవడంతో నిండు వర్షకాలంలో ఖాళీగా మారడాన్ని స్థానిక రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. చెక్‌డ్యాంను ఇలాగే వదిలేస్తే ఆనావాళ్లు లేకుండాపోయే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి జుంటివాగు చెక్‌డ్యాంను మర్మతు చేసి నీటి వృథాను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



వికారాబాద్: కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవంలో జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు



పరిగి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు: క్యాంపు కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



కొడంగల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగరవేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, మునిసిపల్ కార్యాలయం, మార్కెట్ కార్యాలయ ఆవరణలో మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, జిల్లా గ్రంథాలయ ఆవరణలో అదనపు కలెక్టర్, జడ్పీసీఈవో సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర, ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నారాయణరెడ్డి, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో వినయ్‌కుమార్, బార్ అసోసియేషన్ కార్యాలయ ఆవరణలో అధ్యక్షుడు అశోక్ కుమార్, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో సంబంధితశాఖ అధికారులు, ఇన్‌చార్జిలు జాతీయ జెండాను ఎగురవేశారు.

నవాబుపేట: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ జయరాం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట మండల అధ్యక్షుడు ఎం.వెంకటయ్య జాతీయ జెండాలను ఎగురవేశారు.

మోమిన్‌పేట్: ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా మండల నోడల్ అధికారి పూర్ణచందర్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగురవేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మనోహరచక్రవర్తి, ఎంపీడీవో కార్యాలయంలో విజయలక్ష్మి, పీఏసీఎస్‌లో చైర్మన్ బండ విష్ణువర్ధన్‌రెడ్డి, అంజిరెడ్డి జాతీయ జెండాలు ఎగురవేశారు. మేకవనంపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో ఎంపీడీవో విజయలక్ష్మి అమ్మకు గుర్తుగా ఓ మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

ధారూరు: ప్రజాపాలన దినోత్సవాన్ని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

తాండూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజాపాలన దినోత్సవాన్ని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో జెండా ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా డివిజనల్ మెజిస్ట్రేట్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ స్వప్న జాతీయ జెండాను ఆవిష్కరించారు. తాండూరు బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేశారు.

తాండూరు రూరల్: ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి సీఎం సందేశాన్ని విన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ తారాసింగ్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రత్యేకాధికారి మహ్మద్ అబ్దుల్ సత్తార్, స్త్రీశక్తి భవనం వద్ద ఎంపీడీవో విశ్వప్రసాద్, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏడీ రుద్రమూర్తి, మండల విద్యాధికారి కార్యాలయం వద్ద ఎంఈవో వెంకటయ్య, ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఏపీడీ శ్రీలక్ష్మి తదితర కార్యాలయాల వద్ద ఆయా శాఖల అధికారులతోపాటు ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద కార్యదర్శులు జాతీయ జెండాను ఎగుర వేశారు.

యాలాల: మండల కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ అంజయ్య, పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్ఐ శంకర్, సొసైటీ ఎదుట చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఎంపీడీవో పుష్పలీల, ఐకేపీ కార్యాలయం ఎదుట ప్రమీల, ఎమ్మార్సీ భవనం ఎదుట ఎంఈవో సుధాకర్‌రెడ్డి జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

పెద్దేముల్: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులు జాతీయ జెండాలను ఎగురవేసి రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. మండల తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిషన్, మండల పరిషత్ కార్యాలయం వద్ద స్పెషల్ ఆఫీసర్ సత్యనారాయణ, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ.గిరి, సొసైటీ వద్ద మేనేజర్ మురళి అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అయా అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు.

బషీరాబాద్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట మండల ప్రత్యేకాధికారి వి.మోహన్‌బాబు, రెవెన్యూ కార్యాలయం ఎదుట తహసీల్దార్ వై.వెంకటేష్, బషీరాబాద్ గ్రామ పంచాయతీ ఎదుట ప్రత్యేకాధికారి ఎం.విజయ్‌కుమార్, నవాద్గీ సొసైటీ ఎదుట చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ కార్యాలయం ఎదుట చైర్మన్ జి.మాధవరెడ్డి, పోలీస్‌స్టేషన్‌పై ఎస్ఐ ఏఎ.గఫార్, సీహెచ్‌సీ ఎదుట డాక్టర్ శ్రీధర్, ఐకేపీ కార్యాలయం ఎదుట ఏపీఎం పద్మారావు తదితరులు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారిగా మోహన్‌బాబు బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా ఎంపీడీవో కార్యాలయానికి వచ్చినందున ఎంపీడీవో విజయ్‌కుమార్, అధికార సిబ్బంది శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జి.మాధవరెడ్డి ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా స్వగ్రామమైన జీవన్గి ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలలకు వచ్చారు. ఏఎంసీ చైర్మన్ స్థానిక పెద్దలతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహరెడ్డి చేయూత పేరుతో విద్యార్థులకు టై, బెల్టులు, వలంటీరుకు వేతనాన్ని అందజేశారు.

పరిగి: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. మునిసిపల్‌లో చైర్మన్ అశోక్, ఎస్‌డీవోపీలో డీఎస్పీ కరుణసాగర్ రెడ్డి, పీఎస్‌లో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సంతోష్‌లు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, మండల పరిషత్‌లో ఎంపీడీవో కరీం, వివిధ కార్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు, పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. పరిగిలోని తెలుగుతల్లి విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, తదితరులు క్షీరాభిషేకం చేశారు.

పూడూరు: మండలంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద డీపీవో సంధ్యారాణి, తహసీల్దార్ కార్యాలయం వద్ద, పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా పంచాయతీల ప్రత్యేకాధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.

కులకచర్ల: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో, పీఏసీఎస్, వ్యవసాయశాఖ, పోలీస్‌ష్టేషన్ తదితర ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాలను ఎగరవేశారు.

దోమ: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో కార్యాలయంలో మహేశ్‌బాబు, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో ప్రభాకర్‌రావు జాతీయ జెండాలను ఎగరవేశారు. అనంతరం దోమ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

బొంరాస్‌పేట్/కొడంగల్: ప్రజా పాలన దినోత్సవాన్ని బొంరాస్‌పేట్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీదేవి, వ్యవసాయ శాఖ కార్యాలయంలో, తుంకిమెట్ల, బొంరాస్‌పేట్ రైతువేదికల్లో వ్యవసాయ శాఖ అధికారి తులసి, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ జయకృష్ణ జాతీయ జెండాను ఎగరవేసి మహిళలకు గ్యాస్ సబ్సిడీ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ శివకుమార్‌గుప్త జాతీయ జెండాలను ఎగరవేశారు.

కొడంగల్ రూరల్: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని టేకుల్‌కోడ్‌లో రైతువేదిక వద్ద ఏఈవో దేవేందర్, సంగాయిపల్లి, రుద్రారంలో గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద తహసీల్దార్ విజయ్‌కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిమ్మారెడ్డిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు జెండాను ఎగురవేశారు. అదేవిధంగా దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ ఎదుట అధికారులు జెండాను ఎగరవేశారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెడ్డి సుధీర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి, నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, వేముల శ్రీనివాస్ రెడ్డి, మర్రినర్సింహా రెడ్డి, రమణ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్ష్మాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో మొక్కలు నాటారు. అనంతరం గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు స్వచ్ఛభారత్, స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలు చేపట్టి గ్రామాని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్నాథం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

కీసర/కీసర రూరల్: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం నాగారం, దమ్మాయి గూడ మున్సిపల్ కార్యాలయాలతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాలాపన చేశారు.



మేడ్చల్ టౌన్: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



కీసర: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించిన ప్రత్యేక అధికారి పూర్ణిమ

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం ఘట్‌కేసర్, మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్ పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, పోచారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

శామీర్‌పేట: శామీర్‌పేట మండలంలో, తూంకుంట మున్సిపల్‌లో మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శామీర్‌పేట మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో మమతాబాయి, తూంకుంట మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ రాజేశ్వర్‌రావులు జాతీయ జెండాలను ఎంతో ఉత్సాహంగా ఎగురవేశారు. ఎంపీడీఓ మమతాబాయి, మున్సిపల్ కార్యాలయం వద్ద కమిషనర్ వెంకటగోపాల్, సిబ్బందితో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శామీర్‌పేటలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, నాయకులు దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేవరయాంజాల్‌లో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా జాతీయ జెండాను ఎగురవేశారు.

గణనాథుడికి ఘన వీడ్కోలు



వికారాబాద్: భక్తులకు ప్రసాదం పంచిపెడుతున్న స్పీకర్ ప్రసాద్ కుమార్



వికారాబాద్: భక్తులకు ప్రసాదం పంచిపెడుతున్న బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ నందు



కొడంగల్: లాహోటీ వినాయక మండపం వద్ద రుద్రారం గ్రామ విద్యార్థుల కోలాటం

వికారాబాద్, సెప్టెంబరు 17: గణనాథుడికి పదకొండు రోజుల పూజల అనంతరం జిల్లా కేంద్రంలో డప్పు వాయిద్యాలు, నృత్యాల మధ్య ఘన వీడ్కోలు పలికి గంగమ్మ ఒడికి చేర్చారు. పట్టణంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి అనంతరం ధారూరు మండలం ఎబ్బనూర్ చెరువు వద్ద వినాయకులను నిమజ్జనం చేశారు. ఎబ్బనూర్ చెరువు వద్ద పోలీసులతో పాటు మునిసిపల్ సిబ్బంది దగ్గరుండి వినాయకులను నిమజ్జనం చేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మునిసిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత మండపం వద్ద పూజలు చేసి వినాయకులకు స్వాగతం పలికారు. పలువురు పెద్దఎత్తున అన్నదానం చేశారు.

పరిగి: గణేశ్ నిమజ్జన సామూహిక శోభయాత్ర పరిగిమంగళవారం అట్టహాసంగా జరిగింది. పట్టణంలోని వివిధ చౌరస్తాల్లో, కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలందుకున్న గణేశుడికి ఘన వీడ్కోలు పలికారు. దాదాపు 50కిపైగా వినాయక విగ్రహాలను సామూహికంగా మంగళవారం రాత్రి పరిగికి ఏడు కిలో మీటర్ల దూరంలో ఉన్న లక్నాపూర్ ప్రాజెక్టులో ఘనంగా నిమజ్జనం చేశారు. బహార్‌పేట్ హనుమాన్ ఆలయం వద్ద హిందూఉత్సవ సమితి తరఫున నిమజ్జనానికి తరలిన గణనాథులకు పుష్పజల్లుతో స్వాగతించి వీడ్కోలు పలికారు. ఉత్సవాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, మాజీఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ పాల్గొన్నారు.

కొడంగల్: వినాయక నిమజ్జన ఉత్సవాలను కొడంగల్‌లో మంగళవారం వైభవంగా నిర్వహించారు. కొడంగల్‌లోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల నుంచి గణనాథుల శోభయాత్ర నిర్వహించారు. లాహోటీ కాలనీలో వినాయక మండపం దగ్గర రుద్రారం గ్రామానికి చెందిన విద్యార్థులు చేసిన కోలాటం ఎంతో ఆకట్టుకుంది. ఈ మండపం వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో మాజీ ఎంపీపీ ముద్దప్పదేశ్‌ముఖ్ రూ.75వేలకు గణేశ్ లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.ప్రశాంత్, నాయకులు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: అక్నాపూర్‌లో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలంలో మాజీ సర్పంచ్ తలారి అజయ్‌కుమార్ రూ.లక్షా 83వేలకు దక్కించుకున్నారు.

శామీర్‌పేట: శామీర్‌పేట పెద్ద చెరువు నీటిలో గణేష్ నిమజ్జనాలను మంగళవారం పెద్ద ఎత్తున, ఘనంగా నిర్వహించారు. నిమజ్జనాల వద్ద విద్యుత్ శాఖ మేడ్చల్ జిల్లా జోన్ చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) సాయిబాబా, ఎస్ఈ రవికుమార్, ఏడీఈ రమణారెడ్డి, ఏఈ సురేందర్, సబ్ ఇంజనీర్లు శ్రీధర్, యాదగిరిలు సందర్శించి పరిశీలించారు.తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, సిబ్బంది, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, నిమజ్జనాల వద్ద పర్యవేక్షించారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఘట్‌కేసర్ రూరల్: 11రోజుల పాటు పూజలందుకున్న గణపయ్యలు మంగళవారం నిమజ్జనానికి తరలించారు. డప్పు చప్పులు, బ్యాండ్ మేళాల మధ్య గణపయ్యలను ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువులో నిమజ్జనం చేశారు. మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. బుధవారం తెల్లవారుజాము వరకు నిమజ్జనాలు కొనసాగాయి.

పూడూరు: మండలంలోని సోమన్‌గుర్తిలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. సోమన్‌గుర్తిలో శివాజీ యూత్ కమిటీ ప్రతినిధులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన వేలంలో శివాజీ యూత్ కమిటీ ప్రతినిధులు రూ.72వేలకు లడ్డూ సొంతం చేసుకున్నారు. అనంతరం వినాయకుడి శోభయాత్ర కన్నుల పండువగా సాగింది. యూత్ కమిటీ ప్రతినిధులు, యువతుల నృత్యాల మధ్యన శోభయాత్ర కొనసాగింది.

బొంరాస్‌పేట్: మండలంలోని భూ లక్ష్మమ్మ చౌరస్తాలో గత 11 రోజులుగా విశేష పూజలు అందుకున్న మట్టి వినాయకుడికి మంగళవారం నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా కోలాటం ఎంతో ఆకట్టుకుంది. లడ్డూ వేలంలో ప్రజలు పోటాపోటీగా పాల్గొని రికార్డు స్థాయి ధరలో భూ లక్ష్మమ్మ చౌరస్తాలో రూ.67 వేలు, భక్త సమాజం ఆవరణలో రూ.22వేల 500, వీరన్న వినాయకుడి లడ్డూను రూ.23వేలు, కుమ్మరి గల్లి హనుమాన్ మందిరం వినాయకుడి లడ్డూను రూ.18వేలు, పాత ఎస్సీ కాలనీలో రూ.18వేలు, పాండురంగ వినాయకుడి లడ్డూను రూ.27వేలు, అభయాంజనేయస్వామి వినాయకుడి లడ్డూను రూ.28వేలు, వినాయక నగర్‌లో రూ.50వేలు, సంత హనుమాన్‌లో రూ.20వేల 500, బీసీ కాలనీలో రూ.19వేల 500, శివాజీ సేన వినాయకుడి లడ్డూను రూ.30వేలు, దుర్గమాత వినాయకుడి లడ్డూను రూ.24వేల 500, సీతారాంపేట వినాయకుడి లడ్డూను రూ.26వేలు, కొత్త ఎస్సీ కాలనీలో వినాయకుడి లడ్డూను రూ.19వేలకు దక్కించుకున్నారు. అనంతరం వినాయకుడిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి మండల కేంద్రం సమీపంలోని పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు.



వికారాబాద్: రాఘవేంద్ర స్వామి టెంపుల్‌లో వినాయక మండపంలో రూ.51 వేలకు కలశాన్ని దక్కించుకున్న బీజేపీ నాయకుడు కేపీ రాజు



పరిగి: రూ.లక్షా 75 వేలకు గణేశ్ లడ్డూను దక్కించుకున్నమాస్ అధ్యక్షుడు గట్యానాయక్

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

బొంరాస్‌పేట్/పరిగి, సెప్టెంబరు 17: వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందాడు. ఈ ఘటనలు బొంరాస్‌పేట్, పరిగి పరిధిలో మంగళవారం చోటుచేసుకున్నాయి. ఇబ్రహీంపూర్ తండాకు చెందిన మధు(22) బైక్‌పై మంగళవారం బొంరాస్‌పేట్‌కు వస్తుండగా బురాన్‌పూర్‌కు వెళ్లే మార్గంలో మూలమలుపు వద్ద అదుపు తప్పి కిందపడిపోయాడు. గమనించిన స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మధు మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి హన్మానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు నిలిపి ఉన్న లారీని ఢీకొని తీవ్రగాయాల పాలై మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం పరిగి మండలంలోని చింతలచెరువు సమీపంలో చోటుచేసుకుంది. కర్ణాటకలోని సేడెం తాలూకా కాణగడ్డ గ్రామానికి చెందిన చాకలి రాజు(38), సునీత దంపతులు కలిసి మొయినాబాద్‌లో ఉంటూ మేస్త్రీ పని చేస్తుంటారు. రాజు మంగళవారం స్వగ్రామానికి తన బైక్‌పై వెళుతుండగా పరిగి మండలం గడసింగాపూర్ సమీపంలోని చింతలచెరువుల దగ్గర నిలిచి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో రాజు తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు. మరో ప్రమాదంలో ఓ గుర్తుతెలియని యాచకుడు మృతిచెందాడు. ఈ ఘటన పరిగిలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని 70 ఏళ్ల వృద్ధుడు మంగళవారం ఉదయం పరిగిలోని కొడంగల్ చౌరస్తాలో రోడ్డు దాటుతుండగా కొడంగల్ వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న కేఏ32 ఎబి 1190 నంబరు గల లారీ బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. వృద్ధుడి మృతదేహాన్ని పరిగి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంతోష్ తెలిపారు.

సెప్టెంబరు 17 చరిత్రలో ఒక అధ్యాయం



వికారాబాద్: సర్దార్ వల్లబాయ్ పటేల్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

వికారాబాద్, సెప్టెంబరు 17: తెలంగాణ చరిత్రలో సెప్టెంబరు 17 ఒక అధ్యాయంగా మిగిలిపోతుందని, తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో విలీనమైన సందర్భమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని అస్సాం బేకరీ ఆవరణలో మంగళవారం ఉక్కుమనిషి భారతరత్న సర్దార్ వల్లబాయ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు శివరాజ్, నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు, నాయకులు పాండు, కేపీ రాజు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ నరోత్తంరెడ్డి పాల్గొన్నారు.

ధారూరు: ధారూరులో బీజేపీ నాయకులు జాతీయ జెండాను ఎగురవేసి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు.

మర్పల్లి: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మర్పల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రామేశ్వర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేశ్, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మారుతికిరణ్ జెండాను ఎగురవేశారు.



మర్పల్లి: తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

యాలాల: మండలంలో తెలంగాణ విమోచన దినాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్యాలయం ఎదుట మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పురుషోత్తంరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ జయంతి

తాండూరు, సెప్టెంబరు 17: భక్తి శ్రద్ధలతో విశ్వకర్మ మహోత్సవాన్ని మంగళవారం హైదరాబాద్ రోడ్డు ఖాంజాపూర్ గేటు సమీపంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి గుట్టపైన తాండూరు నియోజకవర్గ విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కరుణం పురుషోత్తంరావు, రాజు గౌడ్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, అంజయ్య, నారాయణ, మధులత, పాండురంగాచారీ, శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

పరిగి: ఎబీవీఎఫ్ రాష్ట్ర నాయకులు పాండురంగచారి, ఎం.శ్రీనివాసచారిల ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతిని సందర్భంగా పరిగిలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర వేంకటేశ్వర స్వామి ఆలయంలో హోమం నిర్వహించారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మారుతికిరణ్‌భానేటి మునిసిపల్ చైర్మన్ అశోక్; బి.ప్రమీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **తాండూరు:** తాండూరు సబ్ కలెక్టర్‌గా నూతనంగా నియమితులైన ఉమాశంకర్ ప్రసాద్‌ను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నాయకులతో కలిసి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను సబ్ కలెక్టర్‌కు వివరించారు.
- **దౌల్తాబాద్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడికౌశిక్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు రెడ్డి శ్రీనివాస్, తదితరులు మంగళవారం గోకపస్లాబాద్‌లో కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.
- **నవాబుపేట:** పులుమామిడి జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల, కస్తూర్బాగాంధీ, విజ్ఞాన్ విద్యానికేతన్ పాఠశాలల్లో మంగళవారం సాధన స్వచ్ఛంద సంస్థ వారు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు
- **తాండూరు/ఘట్‌కేసర్:** స్వచ్ఛ భారత్ దివాస్‌లో భాగంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు ప్రధాన రోడ్లను శుభ్రం చేయించారు.
- **దోమ:** బొంపల్లి పాఠశాలలో ఎంఈవో హరిచంద్ర మంగళవారం సందర్శించి విద్యార్థుల హ జరుశాతం తదితర వాటిపై అడిగి తెలుసుకున్నారు.
- **తాండూరు:** ఈనెల 19, 21వ తేదీల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకు గ్యాస్ సిలిండర్ పొందుతున్న అర్హులైన మహిళలందరికీ గుర్తింపు పత్రాలను ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నారు.
- **బొంరాస్‌పేట్:** షరతులు లేకుండా రైతు రుణమాఫీ వర్తింపజేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూర్ చంద్రయ్య, సీఐటీయూ జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య మంగళవారం ఎస్బీఐ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు.
- **బొంరాస్‌పేట్:** గట్టిగాని, నర్సునాయక్, కుబ్యానాయక్, బురాన్‌పూర్, మదన్‌పల్లి, టేకులగడ్డ తండాల్లో శ్రీ శ్రీ సంత్ సద్గురు సేవాలాల్ మహారాజ్, భవానీ మాత దీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి.
- **బొంరాస్‌పేట్:** దుద్యాల మండల నూతన తహసీల్దార్‌గా బీ.వెంకటేశ్‌ప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన దానయ్య తాండూర్ ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లగా షాద్‌నగర్ నుంచి వచ్చిన వెంకటేశ్‌ప్రసాద్ నూతన తహసీల్దార్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు.
- **వికారాబాద్:** అసెంబ్లీ ముందు ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగిస్తామని బీఆర్ఎస్ నాయకులు మేకచంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నివాసంలో తెలంగాణ తల్లి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు.
- **ఘట్‌కేసర్:** తెలంగాణ సాయుధ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని సీపీఎం నాయకులు సబిత, యాదయ్య అన్నారు. పోచారంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తెలంగాణ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రేషన్ డీలర్‌పై విచారణ

బషీరాబాద్, సెప్టెంబరు 17: 'రాత్రి వేళ సరుకుల పంపిణీ.. గొట్టిగకలాన్‌లో రేషన్ డీలర్ ఇష్టారాజ్యం' అంటూ ఆంధ్రజ్యోతి మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ స్పందించారు. ఈ విషయమై కార్యాలయం ఆర్ఐ నాగార్జున్‌రెడ్డిని గ్రామానికి వెళ్లి విచారణ జరుపాలని ఆదేశించారు. ఈ క్రమంలో ఆర్ఐ గ్రామానికి చేరుకుని స్థానిక ప్రజలతో వాస్తవ పరిస్థితులపై తనదైన శైలిలో ఆరా తీశారు. స్థానిక ప్రజలు వాస్తవమేనని చెప్పడంతో ఆర్ఐ వివరాలు నమోదు చేసుకున్నారు. డీలర్ ఇంటికి వెళ్లగా అందుబాటులో లేకపోవడంతో వెనుదిరిగివచ్చారు. బుధవారం మరోసారి గ్రామానికి వెళ్లి డీలర్‌పై సమగ్ర విచారణ జరిపి తహసీల్దార్‌కు నివేదిస్తానని ఆర్ఐ తెలిపారు.

రూ.కోటీ 5లక్షలతో బీటీ రోడ్డు పనులు

పూడూరు, సెప్టెంబరు 17: రూ.కోటీ 5లక్షలతో మండల పరిధిలోని బాకాపూర్ బీటీ రోడ్డును ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటి నీరు పోశారు. అదేవధంగా గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయకునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డి, సురేందర్, ఆనందం, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.